# గాజుకళ్ళు



జి. హరికిషన్

కాలం మన్నుతిన్న పాములా కదులుతోంది.

జయంతి మనస్సు గమ్యానికై వెతుకుతుంది. పరిపరి విధాల ఆలోచిస్తుంది. కళ్ళెంలేని గుఱ్ఱంలా పయనిస్తూంది. నిలుపుకున్న ఆశలన్నీ పేకమేడల్లా కూలిపోతుంటే, మేడల గోడల క్రిందపడి గిలగిలా తన్నుకుంటుంది. నిరాశ, నిస్పృహల వాయువులో చిరుదీపంలా 'రెప రెప' లాడుతుంది. భవిష్యత్తును చూసి భయపడి గతంలో తలదాచుకుంటుంది ఆమె అంతరాళము.

"డాక్టరుగారన్నది విన్నావా జయా? ఈ క్యాన్సరు నన్ను తొందేలై పట్టుకుంది. ఇక వద లదు. నీకు అన్యాయం చేస్తున్నాను జయా!" ఆ మాటలు 'రింగ్' మంటున్నాయి ఆమె చెవుల్లో. మళ్ళీ మళ్ళీ వినబడుతున్నాయి. ఆమె గుండెలు విడిపోతున్నాయి.

"అది అసంభవం, అలా జరుగదు. జరుగ కూడదు, వారు - పున్నమినాటి చంద్రుడు తను - వెన్నెల. పాల నురగల్లాటి తెల్లని వెన్నెలే చంద్రు నికి వేయి అందాలు తెస్తుంది. చంద్రుడస్తమించిన వెన్నెల వుండదు. వారు - వికసించిన పుష్పము. తను - సౌరభం. మత్తుగొలిపే సౌరభం లేనిదే పుష్పానికి శోభరాదు. పుష్పంలేనిదే సౌరభంలేదు. వారు లేనిదే తనులేదు. తను లేనిదే వారికి తృప్తిలేదు శాంతిలేదు" - ఇదీ వారి సజీవ అను రాగం. సరూప అనుబంధం.

"జయంతీ!" — మధుబాబు.

"ఊఁ."

"ఇంకా నిద్రపోలేదూ?"

"లేదు."

"టైమెంతయిందో తెలుసా?"

"తెలీదు."

"పదకొండయింది."

"అలాగా" యంత్రంలా జవాబిస్తోంది జయంతి. ఆమెలో ఉత్సాహంలేదు.

"నీ ఆరోగ్యాన్ని నీవు చాల నిర్లక్ష్యం చేస్తు న్నావు జయా. డాక్టరుగారు చెప్పలా అనీమియా వచ్చిందని పుష్టికరమైన ఆహారం తీసుకోవాలని. అది కాస్త పెడచెవినపెట్టి రాత్రి పగలనకుండ, తిండీ- తిప్పలులేక అస్తమానం ఇలా మేల్కొని బాధపడుతుంటె మరింత నీ స్వస్థ చెడదూ? ఇప్పటికే ఎలా చిక్కిపోయావో చూడు! నిన్ను చూస్తుంటే నా గుండె తరుక్కుపోతుంది. అను క్షణం బాధపడుతున్నాను. నా జయను రక్షించ మని, నా జయ ఒడిలోనే నాకు శాశ్వత విముక్తి ప్రసాదించమని పదేపదే ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తు న్నాను" అతని కంఠం జీరపోయింది.

జయంతి అదిరిపడింది. అతని చివరి మాటలు ఆమె హృదయానికి శూలాల్లా తాకాయి, దుఃఖం ఉప్పెనలా వచ్చింది. చటుక్కున తనమునివేళ్ళతో అతని నోటిని మూస్తూ అంది, "మీకు పుణ్యముం టుంది. మరెప్పుడూ అలా అనకూడదు. దాని కంటె నన్ను చంపిందిమేలు, నా కంఠంలో ప్రాణముండగా మీరు మన బంధాన్ని తుంచి వేయలేరు, మీకేకాదు, ఆ దైవానికికూడా శక్తి లేదు." భోరున ఏడ్చింది. వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఛీ! పిచ్చిదాన, అంతమాత్రానికి ఏడుస్తావా?" ఆమె బాధను నివృత్తిచేయుటకై నడుంచుట్టు చేతులువేసి దగ్గరగా లాగి, గుండెలకు హత్తు కున్నాడు మధుబాబు. ఆమె వణకుతున్న పెదాలను తన పెదాలతో అదిమిపెట్టాడు. అనునయంగా ఆమె కళ్ళలోకి చూచాడు, తృప్తిగా నిట్టూర్చింది జయంతి. ఇంతకుముందున్న భయం, ఆందోళన, బాధల ఛాయలైనా ఇప్పుడామె కళ్ళలో లేవు. అవన్నీ మధుబాబు కౌగిలిలో కరిగిపోయాయి. ఆమె ముఖంలో ప్రశాంతత వెల్లివిరిసింది,

కాస్సేపు మౌనం రాజ్యం చేసింది!

"కాస్త మంచినీళ్ళిస్తావా జయా?"

నెమ్మదిగా అతని కౌగిలినుండి తప్పుకుని లేచి వెళ్ళింది జయంతి. ఒక గ్లాసుతో చల్లని నీళ్ళతో తిరిగి వచ్చింది లోపలినుండి. మధుబాబు గడగడా నీళ్ళు తాగి పడుకున్నాడు. నిండువెన్నెల పిండార బోసినట్లున్నది. మలయ మారుతం చిలిపిగా స్పృశి స్తూంది. ప్రకృతి ప్రశాంతంగా వుంది. ప్రళ యాంతరం ఏర్పడ్డ ప్రశాంతతలా. మధుబాబుకు మాత్రం ప్రశాంతత లేదు. దీర్ఘాలోచనా నిమగ్ను డైనాడు.

"జయా!"

"......"

"ఏమిటాలోచిస్తున్నావు?"

"ఆలోచించడాని కేముంది," ఉలిక్కిపడి అంది జయంతి.

"అవును. ఏమి మిగులుస్తున్నాను కనక."

బరువుగా నిట్టూర్చాడు.

"ఛీ! మళ్ళీ అలా అనకండి మీకు పుణ్య ముంటుంది." పెదాలపై బలవంతాన నవ్వు తెచ్చి పెట్టుకుంది. "అటు చూడండి! దేదీప్యమానమైన వెన్నెల మీవదనారవిందంలో ఎలా ప్రతిబింబిస్తోందో. ఏది జాబిలెలా నవ్వండి. నవ్వితే నేనానందిస్తాను." అంటూ చిలిపిగా అతని కళ్ళలోకి చూసింది. గిలి గింతలు పెట్టింది.

అతడు నవ్వాడు. పున్నమి వెన్నెలలో గలగల పారే సెలయేరులా నవ్వాడు. ఆ నవ్వుల్లో వేయి

వసంతాలు ఏరుకుంది జయంతి. అరమోడ్పు కళ్ళతో అజంతా సుందరిలా పరవశించింది. ఆ పరవశంలో ప్రణయగీతం పాడింది ఆమె అంతర్యం.

"జయా!"

"ఏమిటి?"

"నన్ను నమ్ముతావా జయా?"

"అదేంటండి మనస్ఫూర్తిగా నమ్ముతాను. మీరేది చెప్పినా పవిత్ర దైవం పలికినట్టు భావిస్తాను."

పేలవంగా నవ్వాడు మధుబాబు. ఆ నవ్వు దావ గర్భితమైంది.

ప్రతిగా నవ్వింది జయంతి. ఆ నవ్వు జీవరహితమైంది.

"ఒక నిజమైన కథ చెప్పనా జయా?"

"చెప్పండి."

"వింటావా?"

"తప్పకుండా."

"ఇది కథ కాదు. కటిక నిజం. మధు నా క్లాస్‌మేటు. పైగా చాల సన్నిహితుడు. అవి మేము బి. ఏ. ఫైనల్‌లో వున్న రోజులు. మా క్లాసులో వనజ అని ఒక అమ్మాయి వుండేది. ఆమె చాల అందమైంది. తెలివైందీను. మధు, వనజలకు ఒకసారి విచిత్రంగా పరిచయ మేర్పడింది. తర్వాత వాళ్ళప్పుడప్పుడు కాలేజీ డ్రామాలలో నాయకీ-నాయకుల పాత్రలు ధరించేవారు. డ్యూయెట్ సాంగ్స్ పాడేవారు. ఆ విధంగా వారికి మైత్రి ఏర్పడింది. ఆ మైత్రి చివరకు ప్రేమాయణంలోకి దించింది. వీలు చిక్కినప్పుడల్లా పార్కులకు, సినిమాలకు, బీచ్‌లకు జంటగా తిరిగేవాళ్ళు. ప్రేమకు ప్రతిరూపాలై వారిద్దరి మనస్సులు పెనవేసుకున్నాయి. లతలకు మల్లె. పెళ్ళి చేసుకుంటామని సంతసించారు. ప్రమాణాలు చేసుకున్నారు.

అలా ఎంతోకాలం దొర్లిపోలేదు.

అనుకోకుండా వనజ నాన్నగారు వనజకు సంబంధం చూశారు. వెంటనే నిర్ణయంచేసి ముహూర్తంకూడా పెట్టించాడు కొంపలంటుకున్నట్టు. అంతవరకూ వనజకు తెలిసిన పాపాన పోలేదతను. ఆ హఠాత్పరిణామానికి ఆమె హృదయం తునాతునకలైంది. మిన్ను విరిగి మీదపడ్డట్టు, భూమి అధఃపాతాళానికి క్రుంగినట్టు మనఃక్లేశమనుభవించింది. కన్నీరు మున్నీరుగా ఏడ్చింది మధుకు తను మనసిచ్చానని ఆమె నాన్నతో మొత్తుకుంది, పెళ్ళి విషయంలో తనకు స్వతంత్రం కావాలని కాళ్లా-వేళ్ళాపడి బ్రతిమాలింది. కాని కాలం కనికరించలేదు. వనజ నాన్నకు కరుణ కలుగలేదు. తన నిర్ణయానికి తిరుగులేదన్నాడు.

వనజ మధును చేరి పారిపోదామంది. ఈ విశాల ప్రపంచంలో ఎక్కడైనా తలదాచుకొని హాయిగా బ్రతుకుతామంది. కాని మధు దానికి వప్పుకోలేదు. అగౌరవంగా భావించాడు. వనజకీ విధంగా నచ్చచెప్పాడు — 'వనజా! మీ నాన్న మాట కాదని నువ్వు నాతో వస్తే మీ నాన్న ఎంత బాధపడుతాడు, పైగా అతనికి ఎంత అప్రతిష్ట, అగౌరవమూను. అలా పారిపోయిన మనము జీవితంలో ఏం సుఖం అనుభవిస్తాము? లోకం మనల్ని


## రత్నాలరాసులు

## నాలుగువేల సంవత్సరాలనాడు

"ఆధునిక యువకులు అన్ని విధాలా అధఃపాతానికి పోయారు. వీళ్ళు అసూయాద్వేషాలు వి డి నోవ రిపోతు లవుతున్నారు."

"యువకుల బాధ్యతారహితమైన ప్రవర్తన పతాకస్థాయి నందుకుంటోంది. ప్రపంచం పూర్తిగా తుడిచిపెట్టబడే రోజు ఎంతో దూరంలో లేదు."

"నేటి యువకులు భోగలాలసులు. వీరి అసభ్య ప్రవర్తనకు అంతులేకుండా వుంది. ఏ అధికారాన్నీ లక్ష్యపెట్టరు వీళ్ళు. చట్టాన్ని అతిక్రమించడమే వీళ్ళ ధ్యేయంగా వుంది. వీళ్ళ దృష్టిలో వయసుకు వీసమెత్తు విలువలేదు."

ఇవి చదువుతుంటే నిన్న మొన్నటి వార్తాపత్రికల్లోని విషయాల్లా ఉన్నాయిగదూ. కాని కాదు. బొంబాయి నుంచి ప్రచురించబడిన ఒక పత్రిక ప్రకారం ఆ మూడు వాక్యాలూ, వరుసగా క్రీ. పూ. 2000, క్రీ. పూ. 2500, క్రీ. పూ. 500 సంవత్సరాల నాటివి. వాటి కాధారాలు ప్రాచీన ఈజిప్టు. ఒబిలోనియాలలోని రాతిమీద వ్రాతలు. సోక్రటీసు రచనలు. విచిత్రంగా లేదు. అచ్చుగా ఇవాల్టి వార్తల్లా వున్నాయి. ఇవాళ జరుగుతున్న అల్లరులూ, దాదాపు నాలుగు వేల సంవత్సరాల క్రితం జరిగిన అల్లరులూ, అన్నీ ఒక కోవకు చెందినవే. ఆవేశాలూ, అల్లర్లు, అలజడులు, ఏవో ఒకరకం ధర్నాలు, ఘెరావులు, అన్నీ కలిపి ఒక్కమాటలో 'అశాంతి వాతావరణం'. ప్రపంచం పుట్టినప్పటి నుంచీ వుంది. ఈ మంటిమీద మానవుడి మనుగడ ప్రారంభ మయినప్పటినుంచీ వుంది. ఐతేచ్చి వాటికి కారణాలు వేరువేరుగా వుంటూవచ్చాయి. ఫలితాలు మాత్రం అన్నీ ఒక రకమే.

మానవుడు మొదటినుంచీ చట్ట విరోధి. కొత్త నడవడం నేర్చుకున్న గుంటవెధవ, ఒద్దన్న సైకిల్ దగ్గరికిపోయి మీద పడేసుకోవడంలేదూ. పుట్టుకలోనేవుంది మానవుడిలో ఈ వ్యతిరేక ధోరణి. వొద్దన్న పని చెయ్యలేకపోతే వాడికి నిద్రపట్టదు. అప్పుడప్పుడు నా కనిపిస్తూవుంటుంది-చెడుచెయ్యడం మాని మంచి చెయ్యమని చెప్పే ఈ మతకర్తలూ, రాజకీయ వేత్తలూ, "మంచిచెయ్యడం మానెయ్యకపోతే మసైపోతావు", "చెడు చెయ్యకపోతే శిక్షిస్తాం", అని చెప్పడం ఆరంభిస్తే చట్టాన్ని ఉల్లంఘించడమే మానవ నైజంగనుక, ఎలా మసైపోతామో చూడాలని ఎలా శిక్షిస్తారో కనుక్కుందామని అందరూ మంచిచెయ్యడం మొదలెడతారేమో.

ఆది మానవుడు. దేవుడు తినొద్దన్న పండుతిని - అందులోనూ అతివ మద్దతువుంది - లోకాన్ని పాపకూపంలోకి త్రోశాడు. ఆనాటినుంచి ఈనాటివరకూ అశాంతిని తింటూ బ్రతకడం మానవుడికి దేవుడిచ్చిన శాపమే. కాని ఈ శాపంతో మనం మాడి మసైపోనవసరంలేదు. శాపమిచ్చిన దేవుడు విమోచనగూడా ప్రసాదించాడు. ఆయనే "విమోచనగా" ఈ లోకంలోకి వొచ్చాడు. ఏసుక్రీస్తుగా మనబదులు సిలువమీద మాడి మసైపోయాడు. మళ్ళీ బ్రతికి, వచ్చిన దగ్గరికి పోకముందు చెప్పినమాటలే మానవుడికి విమోచన. క్రీస్తును నీక్రీస్తుగా స్వీకరించి, నీ పాపాల నాయనకు నివేదించి, పాపపరిహారం పొందితే, ప్రపంచంలోని అశాంతి వాతావరణం నిన్నంటదిక. ఆనందజలధిలో ఓలలాడడమే మిగిలిన జీవితమంతా, ఆపైన మరణించాక. ఆలసించకు నేస్తం, అవకాశాన్ని వాడుకుందుకు త్వరపడు.

రానున్న వారం మి కోసం మరొక రత్నాలరాసి.

— ఎన్. జయకుమార్రావు, ఎం. ఎ.

ఉచితం ఉచితం ఉచితం

మీ ఇంట్లో కూర్చుని బైబుల్ పరిశోధనమీద చక్కటి సర్టిఫికేటు పొందాలన్నా బైబుల్‌కి సంబంధించిన అందమైన విలువగల పుస్తకాలు కావాలన్నా ఒక కార్డుమీద మీ అడ్రస్‌తో స్పష్టంగా వ్రాయండి. పోస్టు ఖర్చులుకూడా మావే.

ఇదీ అడ్రస్:
**ఎస్. జాన్ డేవిడ్**
నిరీక్షణ
పోస్టు బాక్సు: 320
గుంటూరు-4.

19 మీటర్లమీద ప్రతిరాత్రి 7.15 గం||లకు సువార్తవాణి రేడియో కార్యక్రమాలు వినండి.

20 th Gospel Message Inserted by S. John David Chilakaluripet, G intur Dt.

పురుగుల్లా చూస్తుంది. సంఘంలో విలువ కరువై పోతుంది. మనకు కలిగే సంతానం సంఘంలో చరిత్రహీనులవుతారు. అలాంటి అశ్లీలమైనజీవితం మనం గడుపలేము. అది దుర్భరమైంది వనజా ! విధిబలీయమైంది. దానికి ఎదురు తిరిగితే అగ్నిలో పడిన మిడుతల్లా మల మల మాడిపోతాము. మీ నాన్న మాట నిలిపి నలుగురిలో ఆయన గౌరవం కాపాడు. నువ్వు ఎక్కడున్నా దీర్ఘసుమంగళివై సుఖంగా వుండాలి. అదే నాకు ఆనందం వనజా."

అడకత్తెరలో ఇరికిన పోకలా తయారైంది వనజ స్థితి. ఒప్పుకోలేక వప్పుకోలేక అంగీకరించిందా సంబంధం. అర్భాటంగా పెళ్ళి జరిగిపోయింది. తర్వాత వనజ మగపెళ్ళి వారింట్లో మధును కల్సుకుంది. అసలు విషయం గ్రహించి ఇద్దరూ లిప్తకాలం ఆశ్చర్యంతో శిలారూపాలు ధరించారు. ఇరువురి కళ్ళల్లో నీరు విలిచింది. ఇదీ కథ !" బరువుగా నిట్టూర్చాడు మధుబాబు. అతని కనుకొలకుల్లో నీరు విలిచింది. అది జయంతి గమనించలేదు.

"కథముగింపు చాల సస్పెన్సులో వదిలారు. నాకేమి అర్థంకావడంలేదు." కుతూహలంగా అతని కళ్ళలోకిచూస్తూ అంది జయంతి.

"జయా ఒకటడుగుతా చెపుతావా ?"

"అడగండి" ఆమెకేమీ అర్థంకాలేదు.

"నీ అభిప్రాయంలో మధు ఎలాంటివాడు ?" కొన్నినిమిషాలు మౌనంగా గడిచాయి.

"ఒక విధంగా మధుగారు త్యాగం చేశారనే చెప్పుకోక తప్పదు, కాని ఆ త్యాగానికి సాఫల్యం మాత్రం లేదని నా నమ్మకం. వారి జీవితాలలో అసంతృప్తి మాత్రమే మిగులుతుంది. సుఖ, శాంతులు కరువైపోతాయి. ఎవరి ఉద్దేశ్యం ఎలా వున్నా నా ఉద్దేశ్యంమటుకు, ఒకసారి మనః ఫలకముపై చిత్రించుకున్న రూపాన్ని చెరిపివేయడం సాధ్యంకాని పని. మనస్సంతా గతాన్ని వెతుకుతుంటుంది. మనిషిమాత్రం వేరై శూన్యంలో వ్రేలాడుతుంటాడు. గతానికి ప్రస్తుతానికి పొత్తు కుదరక తికమక పడతారు. సతమతమైపోతారు. జీవితం అంతా అలాగే సాగుతారు." వేదాంతిలా పలికింది జయంతి.

కాలం ఆగి ఆగి సాగుతోంది.

"జయా ! ఇంత కాలంనుండి నీకొక విషయం చెప్పాలనుకున్నాను. ఇప్పుడుకాని వీలు చిక్కింది కాదు. ఈ నిజం నీ హృదయాన్ని గాయపరుచవచ్చు. కాని ఇంకా నీ వద్ద దాచలేను. దాచి అంతర్గతంగా కుమిలిపోలేను. జయా నన్నర్థం చేసుకో." దుఃఖంతో కూడిన ఆవేశంతో అన్నాడు మధుబాబు.

"ఏమిటండి మీరనేది" పిచ్చెత్తినట్టు అరిచింది జయంతి.

"అవును జయా ! నేను చెప్పిన కథలోని మధుయే నీ మధుబాబు..." అర్థోక్తిలోనే ఆగిపోయాడు. మైకం కమ్మినదానిలా జయంతి తూలి అతనిపై వాలిపోయింది. మధుబాబు ఆమెను తన బాహువుల్లో బంధించి, నుదుటిపై సున్నితంగా పెదాలతో స్పృశించాడు.

"పూర్తిగా విను జయా ! ఆ వనజయే పెద్దన్నయ్యగారి భార్య వనజ. చూడు విధిఎంత టక్కరిది ! ఆ తర్వాత నాకు నీతో వివాహమైంది. నీకా భయంకర రహస్యం చెప్పి బాధపెట్ట కూడదని భావించి, ఇంత కాలం గరళంలా నా గుండెల్లో దాచాను. నన్నర్థం చేసుకుని క్షమిస్తావా జయా ? నన్ను క్షమించమని అర్థిస్తున్నాను జయా !"

జయంతి పలుకలేదు.

"జయా ! జయంతీ !" అంటూ భుజాలు పట్టి కుదిపాడు. దేహమంతా తడిమి చూశాడు, గుండెలకు హత్తుకున్నాడు. ఆమెలో చలనంలేదు. జీవం లేని ఆమె కళ్ళలో కళ లేదు. తృప్తి లేదు. ఆనందం లేదు. గాజు పెంకుల్లా వున్నాయి. అయినా ఆ గాజుకళ్ళు అతని వేపే చూస్తున్నాయి. అతని కళ్ళలోని ప్రేమనే ఆకాంక్షిస్తున్నాయి. అన్వేషిస్తున్నాయి.

కాలం ఆగి, జాలిగా చూసింది. ★

# చినుకులు

చినుకులు ! చినుకులు !
తాటాకుపాకమీద, నా రెయిన్‌కోటుమీద
టపటపలు
చినుకులు చినుకులు
ఉబ్బలకు సలసలకాగే నాకాయంపై
చిత్తజల్లు చినుకులు
ధూళినణచి చల్లబరచిన
వరపు చినుకులు
వయసుసొగసుల ఆచ్ఛాదనపుపయ్యెదను
తడిపిన చినుకులు
తడినీడను తెచ్చిన చినుకులు.

* * *

తడిసిన మట్టిగోడలు
చొడు పొక్కుతున్నాయి
రాతి పునాదుల్లో చినుకులింకి
పోతున్నాయి.
చాకిరేవులో ఆరేసినబట్టలు
ముసలి బంట్రోతు చంకలో ఫైళ్ళకట్టలు
తాతయ్య నెత్తిమీద చాదస్తానురాగపు
మూటలు
ప్రియురాలి వలపు సందేశాలపాటలు
అయ్యో ! చినుకుల్లో తడిసిపోతున్నాయి
కనబడడంలేదు

* * *

చినుకులు, చినుకులు
ఈదరగాలి వీమంది
అమ్మమ్మ ఉబ్బసంజబ్బు బయటేసింది
నులివెచ్చని రాత్రికోసం
బావతాపత్రయం
అది అక్కకు చాలాప్రియం

* * *

రావిచెట్టు ఆకులమీద
ఆ చినుకులధ్వని
ఆ తరువాత అవనిపై ప్రతిధ్వని
బురద, పక్షుల రెట్టలు
పక్షిగూడు గాలికి కూలినప్పుడు
పడిన ఎండుపుల్లలు
రాలినముళ్ళు
చెట్టుక్రింద కాపురముంటున్న
ముష్టివాళ్ళు
తడిసే యిళ్ళకప్పులను, వరండాగచ్చు
నేలను తదేకంగా చూస్తున్న చూపులు...

* * *

మావూరి చెరువు బాగాలోతు
మావారి గుండె చాలాలోతు
చెరువుగట్టు చుట్టూగోతులు
గట్టునుత్రవ్వి గోడలను మెత్తుతున్నారు
తొణుకురాయి గడ్డిదొడ్డి
ప్రహరీ రూపందాలుస్తున్నది
అయినా ఫరవాలేదు.
మావూరికి రాదువరద
వస్తేమటుకు ఏం ?
మిట్టపల్లం భేదంతెలీదు
చేసినతప్పులు చినుకులు
దాచేస్తున్నాయి
మననాగరకతకు వేసికున్న
గురులను చెరిపేస్తున్నాయి
మనస్మృతులను మాపేస్తున్నాయి
మనకేం ఫరవాలేదు
శనగపిండి పకోడీలు అంగట్లో
లభిస్తున్నాయి
మనకు కావలసింది ప్రతి ఒక్కటే
బజారులో బ్లాకులో విరివిగా
లభిస్తుంది
చినుకులకవి తడిసిపోవు

* * *

ఎందుకైనా మంచిది
తలతడిసి పడిశెంపడుతుంది
మనం నల్లనిగొడుగు వేసుకుని
నడుద్దాంపద
చినుకులు చినుకులు

"త్యాగి"